పని ప్రదేశాల్లో మహిళలకు భద్రత కల్పించాలి



నేడు మహిళలు అనేక రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. వారి పని ప్రదేశాలలో ప్రభుత్వం, యాజమాన్యాలు భద్రత కల్పించాల్సిన బాధ్యత ఉంది. కోల్‌కతాలోని ఆస్పత్రిలో సరైన భద్రత లేక పోవటంతోనే వైద్యురాలు అత్యాచారం, హత్యకు గురైంది. ఆ ఘటన చాలా దారుణం. మహిళలు ఉద్యోగాలు స్వేచ్ఛగా చేయలేని పరిస్థితి ఉందని ఈ ఘటన రుజువు చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి మహిళకు రక్షణ కల్పించటమే కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

–షేక్ మస్తాన్‌వలి, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, పెనమలూరు



కోల్‌కతా ఘటన అత్యంత అమానవీయం



కోల్‌కతాలో మహిళా జూనియర్ డాక్టర్‌పై మానవ మృగాలు చేసిన అత్యాచార ఘటన అత్యంత దారుణం, అమానవీయం. వైద్య విద్య అభ్యసిస్తున్న మహిళలకు, తల్లిదండ్రులకు ఈ ఘటన ఎంతో భయాందోళన కలిగిస్తుంది. మహిళలపై అత్యాచారాలకు పాల్పడితే కఠిన శిక్షను అమలు చేసే చట్టాలు తీసుకురావాలి. ఇలాంటి దుశ్చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

–డాక్టర్ కిరణ్మయి, పీహెచ్‌సీ వైద్యాధికారి, వీరవల్లి

క్లుప్తంగా

22 మద్యం సీసాలు స్వాధీనం

పెనమలూరు: గోసాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. గోసాల వైకుంఠపురంలో ఎలిమెంటరీ పాఠశాల వద్ద ఓ వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడన్న సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. వైకుంఠపురానికి చెందిన లారీ డ్రైవర్ బెజవాడ రామకృష్ణ మద్యం అమ్ముతూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద 22 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ వైన్ షాపులో మద్యం సీసాలు తెచ్చి అధిక ధరలకు అమ్ముతున్నాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

హోమియో కళాశాలలో పీజీ కోర్సులకు అనుమతి

గుడివాడరూరల్: గుడివాడ డాక్టర్ గురురాజు ప్రభుత్వ హోమియో కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సులకు అనుమతులు ఇస్తూ జాతీయ హోమియో మండలి సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రొఫెసర్ల కొరత, వసతులలేమి, ఇతర కారణాలతో హోమియో కళాశాల్లో 24 పీజీ కోర్సు సీట్లను కేంద్ర ప్రభుత్వం గతంలో నిలుపుదల చేసింది. సీట్ల రద్దు వలన తాము నష్టపోతున్నామంటూ విద్యార్థులు ప్రజావేదికలో ఎమ్మెల్యే వెనిగండ్ల రామును కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయూష్ కమిషనర్‌తో సమస్యపై ఫోన్‌లో మాట్లాడారు. ఢిల్లీలోని జాతీయ హోమియో మండలి అధికారులు 2024–25 సంవత్సరాలకు పీజీ కోర్సులకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): బెంజి సర్కిల్ వద్ద ఉన్న నాస్తిక కేంద్రంలో స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాలను సోమవారం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేత్రదానంపై అపోహలు, మూఢ నమ్మకాలు ఉన్నాయన్నారు. వాటిని విడనాడి ముందుకు వచ్చి మరణించిన వారి నేత్రాలను అంధత్వం ఉన్నవారికి దానం చేస్తే మరొకరికి చూపు వస్తుందని చెప్పారు. అనంతరం ఆయన నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్వేచ్ఛ గోరా ఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ జి.సమరం, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి, ఎన్టీఆర్ జిల్లా బ్లైండ్ కంట్రోల్ సొసైటీ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ ఈఎస్ఎన్ మూర్తి, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, డాక్టర్ ప్రభాకరశాస్త్రి, ఐబ్యాంక్ మేనేజర్ డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

29న హుండీ కానుకల లెక్కింపు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలు, మొక్కుబడులను ఈ నెల 29వ తేదీ గురువారం లెక్కించనున్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి మహా మండపం ఆరో అంతస్తులో భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలు, మొక్కుబడుల లెక్కింపు జరగనుంది. అయితే ఈ దఫా కానుకల లెక్కింపునకు ఓ ప్రత్యేక ఉంది. ఇటీవల అమ్మవారి ఆలయంలో మూలవిరాట్‌ను సెల్‌ఫోన్ ద్వారా ఫొటో తీసేందుకు ఓ భక్తుడు ప్రయత్నించగా, ఆలయ అధికారి ఆ సెల్‌ఫోన్‌ను లాక్కుని హుండీలో వేసేశారు. అయితే హుండీ లెక్కింపు సందర్భంగా సెల్‌ఫోన్‌ను బయటకు తీసే అవకాశం ఉంది. ఈ సెల్‌ఫోన్‌ను దేవస్థానం వేలం వేయనుందా.. లేక భక్తుడికి తిరిగి అందిస్తారా అనేది తెలియాల్సి ఉంది.

పేదలకు దుప్పట్లు, గొడుగుల పంపిణీ



దుప్పట్లు, గొడుగులు అందజేస్తున్న నిర్వాహకులు

మచిలీపట్నంటౌన్: చిలకలపూడి సెంటర్లోని మదర్ థెరెస్సా విగ్రహం వద్ద నవ చైతన్య మదర్ థెరెస్సా సేవా సమితి 18 వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మదర్ థెరెస్సా జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు, గొడుగులు, స్వీట్లు పంచారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు పైడిపాముల గురుప్రసాద్, మదర్ థెరెస్సా సేవా సమితి కమిటీ ప్రతినిధులు కుమ్మరి హర్ష, శేఖరు, నాంచారయ్య, డొక్కు రాజు, రాధా రంగా మిత్ర మండలి నాయకుడు బుల్లెట్ ధర్మారావు, న్యాయవాది లంకి శెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ప్రసాదంపాడులో కృష్ణాష్టమి వేడుకల్లో జెడ్పీటీసీ సువర్ణరాజు



వీరవల్లిలోని గీతామందిరంలో భక్తులు



కోలవెన్నులో అల్పాహారం పంపిణీ చేస్తున్న రామ్‌–లక్ష్మణ్ యూత్

కృష్ణా..ముకుందా..మురారి

- వైభవంగా శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు
- ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు
- ఉత్సాహంగా ఉట్టికొట్టే కార్యక్రమాలు

పెనమలూరు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పెనమలూరు మండల పరిధిలో కృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో అత్యంత ఘనంగా చేశారు. పోరంకి శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పెనమలూరు శ్రీకృష్ణాలయంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా చేశారు. గ్రామంలో మంగళవారం భక్తలకు అన్నసమారాధన కార్యక్రమం ఆలయ నిర్వహణ కమిటీ ఏర్పాటు చేసింది.

యనమలకుదురులో..

యనమలకుదురు శ్రీసంతాన వేణుగోపాల స్వామివారి ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం భక్తులు ఉట్టి కొట్టి సందడి చేశారు.

ఉయ్యూరు: శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉయ్యూరు పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి, పంచ పట్టాభిరామ స్వామి ఆలయాల్లో స్వామి వార్లను శ్రీకృష్ణుడి అలంకరణలో దర్శనమిచ్చిన స్వామి వారిని భక్తులుదర్శించుకుని విశేష పూజలు చేయించారు. ఆలయంలో ఉట్టి కొడుతూ సంబరాలు చేసుకున్నారు. ఉయ్యూరు వీరమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. యువకులు కేరింతలు కొడుతూ ఉట్టి కొట్టారు.

కంకిపాడు: శ్రీకృష్ణాష్టమి వేడుకలు కోలవెన్నులో సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రామ్–లక్ష్మణ్ యూత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సంబరాలు చేసుకున్నారు. ఉట్టికొట్టే సన్నివేశంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. రామ్–లక్ష్మణ్, ఉపసర్పంచ్ కంచర్ల వెంకటరావు, కంచర్ల శేషగిరిరావు, పలువురు యువత పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం పలు గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, గూడవల్లి గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పలు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలల్లో గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జెడ్పీటీసీ సువర్ణరాజు, రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల బాలాజీ గంగారత్నం, ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ మెండె సుధాకర్, యూత్ నాయకులు పిన్నిబోయిన రవికుమార్, కూరాకుల సుబ్బారావు తదితరులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని వీరవల్లిలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామంలోని శ్రీకృష్ణ గీతామందిరంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయి భజన సమాజం (తేలప్రోలు) సభ్యులు శ్రీకృష్ణుడి గీతాలను ఆలపించి భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సాహంగా ఉట్టి కట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను వాసుబోయిన శివకుమార్, కొడెబోయిన బాబి, నందమూరి నాగభూషణం, చిలకంటి ప్రసాద్, నందమూరి సంధ్య పర్యవేక్షించారు.

విజయవాడరూరల్: మండలంలోని నున్న గ్రామంలో చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి చినకంచిలో శ్రీకృష్ణస్వామి వారికి కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి వేదపండితులు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అలంకరణ అనంతరం నూతనవస్త్రాలను ధరింప చేసి అర్చనలు చేశారు. తొమ్మిది రకాల పిండివంటలతో వెన్నతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు, దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ దంపతులు పాల్గొన్నారు. శ్రీకృష్ణుని విగ్రహదాత ఆవంచ కృష్ణమూర్తి గిరిజా దంపతులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేదపాఠశాల విద్యార్థులు స్థానికులతో కలిసి ఉట్టికొట్టారు. తీర్థప్రసాదముల వినియోగం అనంతరం అన్నదానం జరిగింది. నున్న వేణుగోపాలస్వామి ఆలయంలో, ఏఎస్ఎం కాలేజీ రోడ్డులో యాదవ సంఘం ఆధ్వర్యంలో, కోటకట్ట సెంటర్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. మాజీ ఉప ఎంపీపీ జీతం శ్రీనివాసరావు ఇంటి ఆవరణలో శ్రీకృష్ణుని మందిరంలో భక్తులు పూజలు నిర్వహించారు. పి.నైనవరం గ్రామంలో కోదండ రామాలయం సెంటర్లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. అంబాపురం గ్రామంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఉట్టుకొట్టే కార్యక్రమం నిర్వహించారు.

గన్నవరం: స్థానిక యాదవుటపేట రామాలయంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పూజ కార్యక్రమాలు, సాయంత్రం పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. పరిసరా ప్రాంత యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యాదవ సంఘానికి చెందిన చిమట గంగాధర్, చిమట రవివర్మ, గోపి, చిన్నా, బోయిన శ్రీనివాసరావు, సర్నాల రమేష్, మహి, నాని, రాజేష్ తదితరుల పాల్గొన్నారు.



నున్నలో ఉట్టికొడుతున్న వేదపాఠశాల విద్యార్థులు



పోరంకిలో అలంకరణలో వేణుగోపాలస్వామి

ఉత్సాహంగా ఉట్టికొట్టిన చిన్నారులు

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పదివేల తులసీ దళాలతో శ్రీకృష్ణస్వామికి సహస్ర నామార్చనలు చేశారు. సాయంత్రం భక్తులచే విష్ణు సహస్రనామ పారాయణం, శ్రీకృష్ణాష్టకం, భగవన్నామ సంకీర్తనలు జరిపారు. చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. భక్తులకు శ్రీకృష్ణాష్టమి ప్రత్యేక ప్రసాదంగా కట్టికారం పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు, పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. కేసరపల్లిలోని యాదవుల బజార్‌లో నూతనంగా నిర్మించిన శ్రీమురళీకృష్ణస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా జరిపారు.



గన్నవరంలో ఉట్టి కొట్టే కార్యక్రమంలో..

ప్రమాదభరితంగా వాగుపై చప్టా



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం వికాస్ కాలేజీకి వెళ్లే రోడ్డు చినకంచి వద్ద పెద్దవాగుపై నిర్మించిన చప్టా ప్రమాదభరితంగా ఉంది. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన చప్టా పగుళ్లిచ్చింది. ఈ చప్టాపై నుంచే రోజూ రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లపై రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అందులో వందలాది మంది విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. సాఫీగా సాగే కాలేజీ బస్సుల ప్రయాణం చినకంచి వద్దకు చేరేసరికి విద్యార్థులు ప్రాణాలు బిగపట్టుకొని ఉండాల్సి వస్తోంది. ఎదురెదురుగా వాహనం వస్తే క్రాస్ చేసే అవకాశం కూడా చప్టాపై లేదు. ఇదే రోడ్డులో కొంత దూరం వెళ్లక వేలాది గృహాలతో జగనన్న కాలనీ ఉంది. అక్కడ ఇంటిస్థలాలు వచ్చిన వారు నిత్యం ఇంటి నిర్మాణానికి ఉపయోగించే సిమెంటు, ఇసుక, ఇటుక రాయి, ఇనుము లాంటి మెటీరియల్స్‌ను భారీవాహనాలతో తరలిస్తుంటారు.

సుమారు రూ.6 కోట్లతో అంచనా..

జగనన్న కాలనీలో నివసించే ప్రజానీకం అవసరం దృష్ట్యా చప్టావద్ద కల్వర్టు, కాలనీ వరకు రోడ్డు నిర్మించడానికి అధికారులు అంచనాలు తయారు చేసి ప్రతిపాదనలు పంపారు. నున్న లోని ఎస్‌బీఐ నుంచి వికాస్ కాలేజీ వరకు పనులకు పంచాయతీరాజ్ అధికారులు అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలు ఆమోదించాల్సి ఉంది. కానీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. రోడ్డు నుంచి కింద ఉన్న చప్టాపై వెళ్లేటప్పుడు అనుకోని విధంగా ఏ దైనా ప్రమాదం జరిగితే అంతే పక్కన ఉన్న వాగులో పడే అవకాశం ఉంది.

వాగు పొంగితే రాకపోకలు బంద్..

వర్షాలు కురిసి వాగులు పొంగినప్పుడల్లా వాగు ఉధృతికి వాహనాలు రాకపోకలు నిలిచి పోవాల్సిందే. గతంలో అనేక ప్రమాదాలు జరిగాయి. ట్రాక్టర్‌పై మామిడి చెట్ల కలపను తీసుకొచ్చే సందర్భంలో బోల్తా పడి ప్రమాదం జరగ్గా కూలీలకు గాయాలయ్యాయి. ప్రమాదభరితంగా ఉన్న ఈ చప్టా స్థానంలో కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇక్కడ కల్వర్టు నిర్మించాలని అనేక పర్యాయాలు జగనన్న కాలనీ వాసులు, రైతులు నున్న గ్రామ పంచాయతీకి విన్నవించుకున్నారు. పంచాయతీ పాలకవర్గం కల్వర్టు అవసరాన్ని అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సాగర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీపార్వతీదేవి అమ్మవారికి కూడా పూజలు చేశారు. శ్రీరామలింగేశ్వర ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ఈవో ఎం.గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సమాజ సేవ చేయాలి

ఘనంగా మదర్ థెరెస్సా జయంతి

పెనమలూరు: ప్రతి ఒక్కరూ సమాజానికి సేవలు అందించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మదర్ థెరెస్సా జయంతి సందర్భంగా సోమవారం పోరంకి బీజేఆర్ నగర్‌లో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ మదర్ థెరెస్సా తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేశారన్నారు. మదర్ ఆశయ సాధనకు నేటి యువత సమాజ సేవపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, మంచినేని పరమేష్ పలువురు పాల్గొన్నారు.

కానూరులో..

కానూరులో మదర్ థెరెస్సా జయంతి వేడుకలు ఘనంగా చేశారు. అశోక్ జిమ్, మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవాసంఘ్ ఆధ్వర్యంలో కానూరులో సోమవారం మదర్ థెరెస్సా చిత్రపటానికి దిశ ఎస్ఐ ఎం.వరలక్ష్మి పూలమాలలు వేసి ఘన నివాళులరిచారు. ఎస్ఐ మాట్లాడుతూ మదర్ తన జీవితాన్ని సమాజ సేవ కోసం త్యాగం చేశారన్నారు. ఆమె ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వహకురాలు తాళ్లూరి శారద, బాడీబిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదా రాజేష్, కార్యదర్శి తాళ్లూరి అశోక్, యోగా మాష్టారు శ్రీనివాస్, నరేంద్ర, సుబ్రహ్మణ్యం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: మదర్ థెరెస్సా జీవితం స్ఫూర్తిదాయకమని లయన్స్ జిల్లా కేబినెట్ డెప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్ జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఉయ్యూరు అంబేద్కర్‌నగర్‌లో మదర్ థెరెస్సా జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. మదర్ థెరెస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందించారు. ప్రతినిధులు దీనవాహి ప్రసాద్, హసన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



పోరంకిలో మదర్ థెరెస్సా జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే బోడెప్రసాద్



కానూరులో మదర్ థెరెస్సా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దిశ ఎస్ఐ వరలక్ష్మి



దుస్తులు స్వీకరించిన పారిశుద్ధ్య కార్మికులతో లయన్స్ ప్రతినిధులు

ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైరల్ జ్వరాల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పరిరక్షణకై స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి సీవీఎల్ఎస్ఆర్వీ ప్రసాద్ తెలిపారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పూడికలు తీయించటంతో పాటుగా, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. హనుమాన్ నగర్, ఇందిరా నగర్ ఏరియాల్లో సోమవారం జరిగిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. అంతర్గత రోడ్లు, డ్రైనేజీల వెంబడి బ్లీచింగ్ చల్లారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు విపరీతంగా పెరిగి దోమలు వ్యాప్తి చెందటంతో ఆ ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కట్టా నాంచరయ్య పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించారు.

అల్లాపురం(గన్నవరం): మండలంలోని అల్లాపురంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచి డొక్కు సాంబశివ వెంకన్నబాబు పర్యవేక్షణలో డ్రెయిన్లలో పూడికలు తొలగించారు. దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ మందులు పిచికారీ చేయించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ కార్యదర్శి నేతృత్వంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వాహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ..వర్షా కాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామస్తులు కూడా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. వార్డు సభ్యులు అచ్చయ్య, రాము, మరియదాసు, అవుటపల్లి శివప్రసాద్, పూర్ణచంద్రరావు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అల్లాపురంలో బ్లీచింగ్ చల్లిస్తున్న సర్పంచి డొక్కు



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి ప్రసాద్

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన

గన్నవరం: న్యాయం చేయాలని కోరుతూ విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేసిన కేసరపల్లికి చెందిన పలగాని మధుబాబు తన ఇరువురు కుమార్తెలతో కలిసి సోమవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగాడు. వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న తనను అర్థంతరంగా విధుల నుంచి తొలగించి మానసిక క్షోభకు గురిచేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ.. కేసరపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 2015లో వాచ్‌మెన్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో చేరినట్లు తెలిపారు. 2023 మార్చిలో మూడు రోజుల సెలవు పెట్టిన తనను తిరిగి విధుల్లోకి తీసుకోలేదన్నారు. తన ఉద్యోగాన్ని కొనసాగించాలని అప్పటి నుంచి ఏఈ, డీఈ, ఇతర ఉన్నతాధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నాడు. కనీసం పీఎఫ్ కూడా సెటిల్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. అధికారుల వైఖరికి నిరసనగా ఆందోళన చేపట్టినట్లు తెలిపాడు. ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఏఈ వెంకటరాజు మాట్లాడుతూ మధుబాబు ఆరె నెలలుగా విధులకు గైర్హాజరవుతున్నాడని తెలిపారు. విధుల్లోకి తీసుకోవాలని అర్జీ ఇవ్వగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, వారి పరిశీలనలో ఉందని చెప్పారు.



సబ్‌స్టేషన్ ఎదుట కుమార్తెలతో కలిసి నిరసన తెలుపుతున్న మధుబాబు

8 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనమలూరు: పోరంకి గ్రామంలో పోలీసులు జరిపిన దాడిలో కోతముక్క ఆడుతున్న 8 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకి పాత ఆంధ్రాబ్యాంకు పక్కన ఓ ఇంట్లో కోత ముక్క ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు సోమవారం మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో కోతముక్క ఆడుతున్న 8 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.15,020 సొమ్ము, 8 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. తిప్పిరెడ్డి వెంకట రెడ్డి అనే వ్యక్తి ఒక్కొక్కరి నుంచి రూ.వెయ్యి చొప్పున వసూలు చేసి చట్ట విరుద్ధంగా కోతముక్క ఆడిస్తున్నాడని పోలీసులు తెలిపారు. పట్టుబడిన 8 మంది పై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

యూపీఎస్‌పై రైల్వే ఉద్యోగుల హర్షం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రైల్వే ఉద్యోగులకు కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన న్యూ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి యూపీఎస్ (యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్) అమలు చేయడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. విజయోత్సవ సభలో డెప్యూటీ డివిజనల్ కార్యదర్శి గద్దా సురేష్ మాట్లాడుతూ.. ఎస్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పోరాట పటిమతో యూపీఎస్ అమలు సాధ్యమైందన్నారు. శివ నాగేశ్వరరావు, దాసరి డేవిడ్ రాజు, వినీత్‌సాయి పాల్గొన్నారు.